# మా మ్యానేజరు

♦ ♦ యం. హనుమంతరావు ♦ ♦

ప్రథమమున మా మ్యానేజరుగారివద్ద వుద్యోగమును సంపాదించుటకై, వారివద్ద కయిదుసార్లు మాత్రమే వెళ్ళవలసి వచ్చింది. మొదటి పర్యాయము దర్శించినప్పుడు "ఖాళీలేమైనా వున్నవేమో పెద్ద గుమాస్తాను కనుక్కొని చెప్తాను. ఎల్లుండిరా" అన్నారు. రెండవసారి వెళ్ళినప్పుడు "కనుక్కొనలేదు, ఈదినము అడిగిచెప్తాను, రేపురా" అని శలవిచ్చారు. మూడవసారి "నాకు అస్వస్తతగా వున్నది, ఎల్లుండి వచ్చి నన్ను చూడు." నాల్గవ పర్యాయము "అరవైరూపాయలిస్తాను, నీ యిష్టమేమిటో రేపొచ్చి తెలియచెయ్యి" అయిదవతడవ "మొదటి తారీఖు అయిదురోజులు మాత్రమే వున్నది కాబట్టి, అప్పటివరకు జీతములేకుండా పని చెయ్యి" అన్నారు.

ఉద్యోగములో జేరాను. నేను చేయవలసిన పని, నేనంతకు పూర్వమే చేసిన దగుటవలన, ఎవర్నిగూడ అడిగి నేర్చుకొనవలసిన పని లేక పోయింది. ఆ విధముగా అడగకుండా వుండుట దోషముగా పరిణమించింది. నే నేమి పని చేయుటలేదని, పని చేస్తున్నట్లు నటిస్తున్నానని అదమాయింపు ప్రారంభమైంది.

ఈ అదమాయింపులేకుండా చేసుకొందామని, నాకు తెలియనట్లూ, వారి సలహాప్రకారము చేద్దామన్నట్లుగానూ, మా మ్యానేజరుగారిని ఒకటికి నాలుగుసార్లు అడిగేటప్పటికి, "ఈమాత్రం బుద్ధిలేదా? నీవు బి. ఏ. ఏవిధముగా ప్యాసయినావు?" అని ప్రశ్నల వర్షము కురిపించారు.

"వారమురోజులు శలవు తీసికొని, వెంటనే రావలసినది" అని తంతి మా అన్నగారివద్ద నుండి వచ్చింది. ఏదో పెండ్లి సంబంధము చూడటానికేనని నేను నిశ్చయించుకొని "ఏదో మ్యాచ్ చూచుటకై రమ్మని మా అన్నగారు తంతి నిచ్చారు. కాబట్టి దయచేసి వారమురోజుల శలవ యివ్వకోరుతాను" అని శలవ చీటి వ్రాశాను. అది చూచిన వెంటనే "హాత్, క్రికెట్ మ్యాచ్, హాకీ మ్యాచ్, చూచుకోటానికని వారమురోజుల శలవ యివ్వాలా? నీ వినోదాలకై శలవ యివ్వటానికి వీలులేదు" అన్నారు. అంతట "'మ్యాచ్' అంటే హాకీ మ్యాచ్, కాదండీ! పెండ్లి సంబంధము సార్!" అన్నాను. నా మాటలో నమ్మకములేక, మా సాలుమనును అడిగి రూఢిచేసి కొన్నతరువాత, "పెండ్లిసంబంధమును చూచుటకై వారముదినము లెందుకు? నా మేనమామ చచ్చిపోతేనే నేను శలవ తీసికొని వెళ్ళలేదు, ఇప్పుడు నీకేమి తొందర వచ్చింది?" అని నన్ను ప్రశ్నించారు మా మ్యానేజర్ సాబ్, వెళ్ళక తప్పదని చెప్పినతరువాత శలవ అడిగిన వెంటనే యిచ్చినచో తన హోదాకు భంగమని తలంచి "సరే! నాలుగు రోజులుండి వెళ్ళు" అని ఆజ్ఞాపించారు. పెండ్లి సంబంధము చూచుట యంతగా తొందరైన పని కాదు కాబట్టి, మా మ్యానేజరును సంతృప్తిపరచుటకై, ఆయనగారి యిష్టప్రకారము నడచుకొన్నాను.

పెండ్లి సంబంధమును చూచి వచ్చిన, ఇరువది రోజులకే, లగ్నము నిశ్చయింపబడినది. లగ్నమింకా రెండు రోజు లున్నదనగా, శలవకై ధరఖాస్తు పెట్టుకొన్నాను. ఆ ధరఖాస్తును చూచిన తక్షణమే "ఛూత్, పెండ్లి

సంబంధమంటావు; పెండ్లి అంటావు; శలవ ఇవ్వమంటావు—యివన్నీ నాకు తెలియవ్, నీకు శలవ ఇచ్చుటకు వీలులేదు. నీ పెళ్ళికేమి తొందర వచ్చింది? చూడు నా కూతురుకు పందొమ్మిదవ యేడు. ఇప్పటికీ వివాహము చేయలేదు. తెలిసిందా?" అన్నారు మా మ్యానేజరుగారు.

విధముగా పెండ్లి చేయకుండుట పెద్ద గొప్పతనముగా తలంచుచున్నాడు గాబోలు, పాపము! ఒట్టి అమాయకుడుగా నున్నాడు, అని నాలో నే ననుకొని, "నేను మొగవాడిని, సంపాదించుకుంటున్నవాడిని; అందువలన చెడుగా తిరుగుతానన్న భయముకొద్దీ, నాకు మా పెద్దవాళ్ళు పెండ్లిచేయ దల్చారు" అన్నాను. "అట్లాగా! సరే! పెండ్లిచేసుకోదలుస్తే, ఈ ఉద్యోగముపై ఆశలు వదలుకొని పో. నీవు వచ్చేలోపల ఖాళీ పూర్తి అయితే నేనేమీ చేయలేను." అన్నారు మా మ్యానేజర్ గారు.

నా కెక్కడలేని కోపమొచ్చింది. చేతుల్ని అమ్ముకుంటే, పొట్టకూటికి ఎక్కడినైనా ఈ రోజులల్లో సంపాదించవచ్చు. ఈయనగారి వుద్యోగమునకై మన పరువు, మర్యాదల నమ్ముకొనుటయా? అంతకన్నా నీచమైనపని ఏమైనా వున్నదా? ఈ ఆఫీసు ఎక్కడ నున్నదీ తెలియని స్థితిలో ఎవ్వరు రాబోయినారు లెద్దూ. అంతకూ ఒస్తే, వేరేనౌకరి చూసుకోవచ్చునని నాలో నే ననుకొని, "పెండ్లివచ్చినా, కక్కొచ్చినా ఆగవు" అన్న పెద్దల వాక్కులు వెంటనే జ్ఞాపకమునకురాగా, "ఈ ఉద్యోగమునకై నా వివాహము ఆగిపోదు. ఉద్యోగములోనుండి తీసివేయుట, పెండ్లి చేసుకున్నందుకు శిక్షే గనుక అయితే దానికి సంసిద్ధుడనే, మీ ఇష్టమొచ్చినట్లు చేయండి. ఈ సాయంకాలము ఏడు గంటల బండికి వెళ్ల నిశ్చయించుకొన్నాను." అన్నాను.


# జమున మూలికామలాం

పుండ్లు. కోతలు. కాల్పులు. గజ్జి. మొదలయిన చర్మవ్యాధులను మాన్పుటలో అసమానమై. హిందూదేశ మంతటా ఖ్యాతిగాంచినది. అన్నిచోట్ల దొరుకును

పెద్దడబ్బీ రు. **0-12-0** చిన్న డబ్బీ రు. **0-2-6**

తయారుచేయువారు:

**పి. కె. కెమికల్ వర్క్సు. గుంతకల్ (ఇండియా)**


ఇతడు ఉద్యోగమునకై లక్ష్యము చేయువాడుగా లేదనుకొన్నాడు కాబోలు "రేపటి నుండి శలవ పదిరోజులిస్తాను. ఆ పదిరోజులకు జీతమేమి యుండదు. నీ శలవ అయిన వెంటనే గనక రాకపోతే నీ ఉద్యోగము నీకుదక్కదు." అన్నారు.

"ఆహా! భగవంతుడా! నీ లీల లద్భుతము. ఇట్టి మహాశయుని మనస్సును నిమిషములో త్రిప్పితివిగదా? ఈ ఋణమును. నమస్కారములతో మాత్రము తీర్చుకొందును" అని ఆ రామచంద్రునకు వెయ్యి నమస్కారములు చేశాను.

నాకు వివాహమైన నెలరోజులకు జ్వరము తగిలింది. అందువల్ల పదిరోజులు శలవ పెట్టాను. పదకొండవ రోజున ఆఫీసుకు వెళ్లాను. మా మ్యానేజరుగారు "అంత ఎక్కువగా ఎందుకు తిన్నావు? నీకు అరవైరూపాయల జీతము ఎక్కువ కావటమువలన తిండి ఎక్కువైంది. ఈ జీతమింత ఉన్నంతకాలము నీతిండిని నీవు తగ్గించుకోలేవు. కాబట్టి నీ జీతమును ఏభై రూపాయలు చేస్తాను. అందుల కిష్టమై పనిచేస్తే చెయ్యి, లేకపోతే నీ దోవ నీవు చూసుకో" అన్నారు.

"చదివినప్పుడల్లా ఊడే ముక్కును ఎంతకాల ముంచుకుంటాము. మీ నౌకరికీ, మీకూ ఒక నమస్కారము. నా రాజీనామా స్వీకరించండి" అని రాజీనామా పత్రమును వ్రాసిచ్చి, మా మ్యానేజరుగారికి సలాముచేసి బయటపడ్డాను.